క్లుప్తంగా

బత్తులకు అభినందనలు



బత్తుల బ్రహ్మానందరెడ్డికి అభినందనలు తెలుపుతున్న కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి బుధవారం ఆయన నివాసంలో కలిసి శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్ అభ్యున్నతికి పాటుపడాలి

సంతనూతలపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ అభ్యున్నతికి పాటుపడాలని మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఇవాంజిలిన్ కోరారు. సంతనూతలపాడు సెక్టార్ పరిధిలోని ఒకటో అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం పీపీ-1, పీపీ-2 అసైన్మెంట్ కార్యక్రమాన్ని సీడీపీఓ పరిశీలించి మాట్లాడారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ నాగలక్ష్మి కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మరియమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఒంగోలు సిటీ: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఒంగోలు, జేపీసీ ఒంగోలు, సంస్కార భారతి, ప్రకాశం జిల్లా వారి ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు స్థానిక గద్దలగుంటలోని ఎస్పీకేఆర్ఎస్ఏవీఎన్ ఓరియంటల్ హైస్కూల్లో 14 సంవత్సరాల్లోపు బాలబాలికలకు ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జూనియర్ చాంబర్ ఒంగోలు అధ్యక్షుడు జేసీ మేడిశెట్టి వెంకట సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. జేపీసీ ఒంగోలు చైర్మన్ వెన్నపూస శ్రీరాములరెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిష్, వేదిక్ మేథమేటిక్స్, డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలు, శతక పద్యాలు నేర్పించనున్నట్లు చెప్పారు. పిల్లల హ్యాండ్ రైటింగ్ పెంపొందించడానికి ప్రత్యేకమైన సూచనలు చేసేందుకు శిక్షకులను నియమించినట్లు చెప్పారు.

సత్యసాయి బాబా మందిరంలో...

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు జెడ్పీకాలనీలోని సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి బాలవికాస్ సమ్మర్ క్లాసులను బుధవారం ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి అన్నదానం

సంతనూతలపాడు: అక్షయ తృతీయ సందర్భంగా సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం 300 మందికి అన్నదానం చేశారు. ఒంగోలుకు చెందిన గాదంశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మీ సుప్రియ దంపతులు 49వ వారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామిచౌదరి, సెక్రటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ప్రకృతి వ్యవసాయానికి మారాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కొత్తపట్నంలో విస్తృత పర్యటన

కొత్తపట్నం: రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా కషాయాలు వాడుకుని నూరుశాతం ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఆ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. కొత్తపట్నం మండలంలో బుధవారం విస్తృతంగా కలెక్టర్ పర్యటించారు. ముందుగా రంగాయపాలెంలో కృష్ణం వెంకట్రావు డెయిరీ ఫాంను సందర్శించారు. పాడి రైతులకు సబ్సిడీపై మేత విత్తనాలు, దాణా పంపిణీ చేశారు. డెయిరీ ఫాం ఏర్పాటుకు ఎంత ఖర్చయింది, నిర్వహణ కోసం నెలకు ఎంత ఖర్చవుతుంది, ఖర్చులన్నీపోను ఎంత ఆదాయం మిగులుతుంది, తదితర వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ డెయిరీ ఫాంకు బ్యాంక్ నుంచి రూ.25 లక్షల రుణం తీసుకోగా, 32 ఆవులున్నాయని, వాటి ద్వారా రోజుకు 400 నుంచి 500 లీటర్ల పాలు దిగుబడి వస్తుందని కలెక్టర్‌కు వెంకట్రావు తెలిపారు. కూలీలు, దాణా, లోన్ ఈఎంఐ, ఇతర ఖర్చులన్నీపోను నెలకు లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు మిగులుతుందని చెప్పారు. అనంతరం డీడీ కాలనీలో రాగాల నాగేశ్వరరావు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని కలెక్టర్ సందర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు. తదుపరి వజ్జిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండీఎస్ విధానం ద్వారా పంటలు సాగుచేస్తున్న రైతు పిట్టు వెంకటేశ్వరరెడ్డితో కలెక్టర్ మాట్లాడారు. పైరును సందర్శించి వివరాలు సేకరించారు. బంజరు భూమిలో పీహెచ్, తేమ, ఉష్ణోగ్రత నమోదుపై, పీఎండీఎస్ క్షేత్రంలో మట్టి నమూనా సేకరణపై వ్యవసాయ అధికారులు నిర్వహించిన డెమోను కలెక్టర్ పరిశీలించారు. పీఎండీఎస్ విధానం వలన సాయిల్ హెల్త్‌క్రాప్ హెల్త్ బాగా వృద్ధి చెందుతుందని కలెక్టర్‌కు వ్యవసాయ శాఖాధికారులు వివరించారు. కొత్తపట్నం హార్టీకల్చర్ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్.. పలు రకాల మొక్కల పెంపకాన్ని పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎండీఎస్ కిట్ల తయారీ, పంపిణీ, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ప్రదర్శనలను కలెక్టర్ సందర్శించి అభినందించారు. రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. హార్టీకల్చర్ ఫాంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి, వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి జేడీ సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి, ఏపీఎంఐపీ పీడీ రమణ, జిల్లా హార్టీకల్చర్ అధికారి గోపీచంద్, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మండల పశుసంవర్థక శాఖాధికారి ఆషా తదితరులు పాల్గొన్నారు.



డీడీ కాలనీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వేరుశనగ పైరును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సర్వే నంబర్ 1429 ఏ, బీలను సబ్ డివిజన్ చేయండి...

కొత్తపట్నంలో పర్యటన అనంతరం హార్టీకల్చర్ క్షేత్రం వద్ద రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. కొత్తపట్నం ప్రజలు అక్కడకు చేరుకుని సర్వే నంబర్ 1429 ఏ, బీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పెద్ద కోడూరి వెంకారెడ్డి మాట్లాడుతూ సర్వే నంబర్ 1429 ఏ, బీలో 84 ఎకరాలు గ్రామ కంఠంగా ఉందని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దేవదాయశాఖ కింద ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోందని తెలిపారు. కానీ, దేవదాయశాఖకు కేవలం 1.26 ఎకరాలే ఉండగా, మిగిలిన స్థలంలో గ్రామస్తుల ఇళ్లు ఉన్నాయని వివరించారు. దేవదాయశాఖను భూమిని సబ్ డివిజన్ చేయించాలని కలెక్టర్‌ను కోరారు. లేకుంటే గ్రామంలో 3 వేల కుటుంబాలు అవస్థపడుతున్నాయని తెలిపారు. చాలా మందికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడం లేదని, మార్టిగేజ్‌లు చేయటం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ స్పందించి వెంటనే సబ్ డివిజన్ చేయాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావును ఆదేశించారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఏర్పాటు చేసిన టైలరింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన ఎన్ఆర్ఈజీఎస్ భవనంలో కొనసాగుతున్న మండల స్థాయి ఉచిత టైలరింగ్ శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలు జీవనోపాధి పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణ పొందుతున్న మహిళలకు 70 శాతం అటెండెన్స్ ఉండాలన్నారు. సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలి

- ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి

మద్దిపాడు: పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో వివరించారు. గత సమావేశంలో తెలిపిన సమస్యలను గుండ్లాపల్లి ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి ప్రస్తావించారు. ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రెండు సంవత్సరాల నుంచి ఎందుకు మంజూరు చేయడం లేదని ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్‌ను వివరణ కోరారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలోనే గౌరవ వేతనాలు మంజూరవుతాయని తెలిపారు.. దొడ్డవరప్పాడు గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు బెజవాడ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ తమ గ్రామంలోని పంచాయతీలో అభివృద్ధి పనులు చేద్దామంటే.. గతంలో చేసిన పనులకే నిధులివ్వకుండా, పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు. త్వరలోనే పనిచేసి పెడతామని చెబుతూ అధికారులు సమాధానమివ్వడంతో.. గత సర్వసభ్య సమావేశంలో కూడా గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులకు ఈ విషయం తెలియజేశామని, కానీ, వారిలో మార్పు రాలేదని ఎంపీపీ అన్నారు. సక్రమంగా పనిచేయని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో పంచాయతీ పాలకులకు తెలియకుండా నిధులు ఎలా మంజూరు చేశారని ఎంపీడీవోను సర్పంచులు నిలదీశారు. గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌కి తెలియకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా, కార్యదర్శులు, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ ఆదేశాలు జారీ చేశారు.

పశువైద్యం సక్రమంగా అందడం లేదని నిలదీత...

గ్రామాల్లో పశు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆ శాఖ అధికారులను సర్పంచ్‌లు నిలదీశారు. పశుసంవర్థక శాఖ ఏడీ సుగన్యారావ్ వివరణ ఇస్తుండగా, పలువురు గ్రామ సర్పంచులు జోక్యం చేసుకుంటూ సభకు మొదటిసారి మీరు హాజరయ్యారని, కానీ, గతంలో మీ శాఖ తరఫున ఎవరూ హాజరు కాలేదు ఎందుకని నిలదీశారు. మండల కేంద్రంలో పశుసంవర్థక శాఖ భవనాన్ని కోట్ల రూపాయలతో గత ప్రభుత్వం కట్టించినా ఉపయోగించడం లేదన్నారు. మంత్రి డోలా బాలవీరాంజనేయులు మద్దిపాడు వచ్చిన సమయంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు లేదన్నారు. పశు సంవర్థక శాఖ ఏడీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

తెల్లపాడు ఎస్సీ కాలనీలోని ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలను మరో ప్రభుత్వ పాఠశాలలో క్లబ్ చేస్తున్నారని, తమ కాలనీలో పిల్లలకు పాఠశాల ఎలాగని ఎంఈఓ ఆంజనేయులును దొడ్డవరం ఎంపీటీసీ మేరిగ పద్మ ప్రశ్నించారు. తమ పాఠశాలను అలాగే ఉంచాలని పట్టుబట్టారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు, ఘడియాపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు వాకా కోటిరెడ్డి, పల్లకీ పద్మకుమారి, పైనమ్ ప్రభాకర్, బొమ్మల దేవదాసు, సర్పంచులు నారా వెంకటసుబ్బారెడ్డి, బొమ్మల రామాంజనేయులు, డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆయా శాఖల మండల, గ్రామ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలసదనం, శిశుగృహ ఆకస్మిక తనిఖీ

- శిశుగృహ మేనేజర్‌కు చార్జ్‌మెమో ఇవ్వాలని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి ఆదేశం



బాలసదనంను తనిఖీ చేస్తున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహిస్తున్న బాలసదనం, శిశుగృహాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదనం, శిశుగృహాలో రక్షణ, సంరక్షణ అవసరమై ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లు తనిఖీ చేసి సలహాలు, సూచనలు చేశారు. పిల్లల రిజిష్టర్లలో ఐసీపీ, ఆ కేసు స్టడీ రిపోర్ట్, హెల్త్ స్టడీ రిపోర్టు లేకపోవడాన్ని గుర్తించి 10 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర జిల్లాలకు చెందిన బాలికల తల్లిదండ్రులను గుర్తించి పిల్లలను వారికి అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శిశుగృహను సందర్శించి ఆరు సంవత్సరాల్లోపు శిశువులకు అందుతున్న న్యూట్రిషన్, హెల్త్ కండిషన్, ఇతర వివరాలడిగి తెలుసుకున్నారు. అవుట్ డేటెడ్ మెడిసిన్‌ను గుర్తించి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. అవుట్ డేటెడ్ మెడిసిన్‌కు సంబంధించి శిశుగృహ మేనేజర్‌కు చార్జ్‌మెమో ఇవ్వాలని ఆదేశించారు. త్వరితగతిన దత్తత ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి బి.హెనసుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, కే శేఖర్‌బాబు, బాలల సంరక్షణ అధికారి ఇన్‌స్టిట్యూషనల్ కేర్, బాలసదనం సూపరింటెండెంట్ మల్లేశ్వరి, శిశు గృహ మేనేజర్ రాఫా హేరియట్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఉల్లాసభరితంగా వేసవి విజ్ఞాన తరగతులు



పిల్లలకు కథలు చెబుతున్న కాశీవిశ్వనాథ్

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. బుధవారం 31 మంది చిన్నారులు తరగతులకు హాజరయ్యారు. వారితో కథలు చదివించడమే కాకుండా చెప్పించారు. పిల్లలతో యోగా చేయించారు. యోగా వలన ఉపయోగాలను వివరించారు. రంగురంగుల పెన్సిళ్లతో పక్షులు, పువ్వుల చిత్రాలు గీయడమెలాగో నేర్పించారు. లూసిడా హ్యాండ్ రైటింగ్, లీఫ్ ప్రింటింగ్, క్లే మోడ్‌లలో శిక్షణ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ లైబ్రేరియన్ బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా పిల్లలను గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ తరగతులలో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కాశీవిశ్వనాథ్, వెంకయ్య, టి.రవీంద్ర, శిరీష, ఆర్.బిందుమణి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర వికాసం అవసరం

- ఐసీడీఎస్ పీడీ హేనసుజన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనసుజన, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: కిశోర వికాసం బాలికలు, బాలురకు ఎంతో అవసరమని ఐసీడీఎస్ పీడీ బి.హేనసుజన అన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన 11 నుంచి 18 సంవత్సరాల పిల్లల అభివృద్ధి, రక్షణ, సాధికారత పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలు, బాలురకు వారి హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలకు పోషణ, నైపుణ్యాలు, భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించడం లాంటి ముఖ్య లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకుల శుభాకాంక్షలు





వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న దుంపా రమణమ్మ, ఇతర మహిళా నాయకులు, నల్లమలపు కృష్ణారెడ్డి, తదితరులు

సంతనూతలపాడు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఒంగోలులో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమలపు కృష్ణారెడ్డి, సంతనూతలపాడు జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, రాష్ట్ర కల్చరల్ విభాగం కార్యదర్శి రజిని, మద్దిపాడు మండల అధ్యక్షురాలు పి.సంధ్య, సన్నపురెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నాయకుడు అంకయ్య త్రోవగుంట వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



నెహ్రూకాలనీలోని దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: అక్షయ తృతీయ పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలులోని లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో, కమ్మపాలెంలోని కాళికా అమ్మవారి దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం వద్ద గల శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో, గద్దలగుంట మహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మ దేవస్థానం, కేశవస్వామిపేటలోని విజయదుర్గా అమ్మవారి దేవస్థానం, పెళ్లూరు జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలోని నాగలక్ష్మి ఆలయం, గంటాపాలెం పార్వతమ్మ దేవస్థానం, గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, సమతానగర్ సాగర్ కాలువ దగ్గర దుర్గామల్లేశ్వరి దేవస్థానం, మంగమూరు డొంక గాయత్రి మందిరం, కేశవస్వామిపేటలోని లలితాశ్రమంలో ఆలయ అర్చకులు ఉదయం అభిషేకాలు, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల షాపుల్లో సందడి...

అక్షయ తృతీయ పండుగ సందర్భంగా ఒంగోలు నగరంలోని బంగారు ఆభరణాల షాపుల్లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో కొనుగోలుదారులు అధిక సంఖ్యలో షాపులకు చేరుకుని బంగారం కొనుగోలు చేశారు.



కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఒంగోలు కర్నూలు రోడ్డులోని ఓ బంగారు ఆభరణాల షాపు